సాక్షి
తిరుపతి
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



సదస్సు విజయవంతం చేద్దాం
మహిళా సాధికారత జాతీయ సదస్సును సమష్టిగా కృషి చేసి విజయవంతం చేద్దామని కలెక్టర్ కోరారు. - 8లో



మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
మహిళల ఆర్థికాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. - 8లో



శ్రీవారి సేవకుల సేవలు అమోఘం
శ్రీవారి సేవకుల సేవలు అమోఘమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ కొనియాడారు. - 8లో

న్యూస్‌రీల్

మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి వైఎస్సార్ కడపకు బదిలీ



సతీష్, మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్ : మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి సతీష్ వైఎస్సార్ కడప జిలా ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన మూడేళ్లుగా మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారిగా పనిచేశారు. అలాగే విజయనగరంలో పనిచేస్తున్న చిన్నరెడ్డెప్పను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. ఆ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే వారంలో సతీష్ జిల్లా నుంచి రిలీవ్ కానున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 66,312 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,728 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.81 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

డిగ్రీ అడ్మిషన్ల గందరగోళానికి తెర

తిరుపతి సిటీ : డిగ్రీ అడ్మిషన్ల విషయంలో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు, అధ్యాపకులను గందరగోళానికి గురి చేసిన ఉన్నత విద్యామండలి అధికారులు ఎట్టకేలకు సందిగ్ధానికి తెర దించారు. శనివారం సాయంత్రం వరకు ఇప్పటికే ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాల సమర్పణలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించారు. ఆదివారం విద్యార్థులు సాధించిన మార్కులు, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయించి విద్యార్థుల మొబైల్స్‌కు మెసేజ్‌లు పంపించనున్నట్లు కళాశాల యాజమాన్యాలకు సమాచారం అందించారు. సీట్లు సాధించిన విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలలో సోమవారం రిపోర్టు చేసి అడ్మిషన్లు పొందాల్సి ఉంటుందని ఉన్నత విద్యామండలి అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

17న తడలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్ : ఈనెల 17న తడలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీసిటితో పాటు తిరుపతి, చెన్నై ప్రాంతాల్లో ఉద్యోగాల ఎంపికకు ఈమేళా జరుగుతోందని చెప్పారు. పదో తరగతితో పాటు ఆ పైన చదువుకున్న విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 91216 46661, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

16 నుంచి అప్పలాయగుంట పవిత్రోత్సవాలు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ ఈఓ శ్రీవాణి తెలిపారు. దోషాల నివృత్తితో ఆలయ పవిత్రతను కాపాడేందుకు ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. 16న అంకురార్పణ, 17న పవిత్ర ప్రతిష్ఠ, 18న పవిత్ర సమర్పణ, 19న మహాపూర్ణాహుతి కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. పవిత్సోవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అమ్మవారి ఆలయంలో.. 22 నుంచి నవరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి : తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అదేవిధంగా సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 2వ తేదీ విజయ దశమి సందర్భంగా అమ్మవారు గజ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు అధికారులు చెప్పారు.

అక్షరమే ఆయుధం






పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు

ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. పాత్రికేయులకు స్వేచ్ఛ ఇవ్వాలి. నిజాలను నిర్భయంగా రాసే వారిపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. నాయకులు తెలియజేసిన విషయాలను కూడా పేపర్లలో రాయడం నేరమనడం హాస్యాస్పదం. అలాగే పోలీసు వ్యవస్థలో లోటుపాట్ల గురించి వాస్తవాలు రాస్తే పత్రికా యాజమాన్యంపై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో వేధించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. 'సాక్షి'పై కేసు నమోదును తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు.

-జ్ఞానేంద్రరెడ్డి, మాజీ ఎంపీ, చిత్తూరు

ప్రజాస్వామ్యానికి ముప్పు



వాస్తవాలను వెలికితీసే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, వేధించడం ప్రజాస్వామ్యానికి ముప్పు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలపై రాజకీయ నాయకులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, ప్రసంగాలపై సాక్షి దిన పత్రికలో ప్రచురించారనే ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదు చేయడం, పత్రిక, ఎడిటర్, సిబ్బందిని నిందితులుగా చూపడం హాస్యాస్పదం. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా పత్రికలపై కేసులు పెట్టి, వేధించడం దారుణం. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పత్రికలు నిర్వీర్యమైపోతాయి. బలమున్నవాడికే జీవించే హక్కు లభిస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైన ఈ విషయంలో పునరాలోచించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా పాలించాలి. లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

- రెడ్డెప్ప, మాజీ ఎంపీ

కాలేజీ ఇక్కడ.. అనుమతి ఎక్కడో?

జిల్లాలో అనుమతి లేని ప్రైవేటు కళాశాలలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. అనుమతి ఒకచోట తీసుకొని.. చదువు ఒక చోట ..నిర్వహణ మరోచోట చేస్తూ కొన్ని ప్రైవేటు కళాశాలలు దందా సాగిస్తున్నాయి. ఆకర్షణీయమైన బ్రోచర్లతో ప్రైవేటు కాలేజీలు తల్లిదండ్రులను బురిడీ కొట్టించి ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. పర్యవేక్షించాల్సిన ఇంటర్‌మీడియట్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. నిబంధనలు లేకున్నా అనుమతులు ఇచ్చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుండడంపై విస్మయం వ్యక్తం అవుతోంది.

- **ఇంటర్ విద్య.. అనుమతి మిథ్య!**
- జిల్లాలో విచ్చలవిడిగా అనుమతుల్లేని ప్రైవేట్ కళాశాలలు
- అనుమతులు ఒకే కళాశాలకు.. పలు బ్రాంచీల పేరుతో నిర్వహణ
- కూటమి పార్టీ నేతల అండదండలతో రెచ్చిపోతున్న యాజమాన్యాలు
- తల్లిదండ్రులను మభ్యపెట్టి నడిపిస్తున్న ప్రైవేటు కళాశాలలు



తిరుపతి సిటీ : తిరుపతి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆర్థిక, రాజకీయ ప్రలోభాలతో అధికారులను లొంగదీసుకుని వారికి అవసరమైన అనుమతులను పొందుతున్నారు. ఇందులో ప్రధానంగా తిరుపతి నగరంలో ప్రైవేటు యాజమాన్యాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి వారు ఆదేశించిన ప్రకారం అధికారులు తలవంచేలా తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. కొన్ని కళాశాలకు అనుమతులు ఒక చోట పొంది మరొక చోట తరగతులు చెబుతున్నారు. అలాగే అనుమతి ఒక కళాశాల పొంది రెండు, మూడు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఈ తతంగం సాగుతున్న విషయం ఇంటర్మీడియట్ అధికారులకు తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా అనుమతి లేని ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

మంత్రి కళాశాలలు నిబంధనలకు చెల్లుచీటీ

జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు ఇంటర్ కళాశాలలను అనుమతి లేకుండా నడుపుతున్నారని విద్యార్థి సంఘాలు, మేధావులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారపార్టీకి చెందిన ఓ మంత్రికి చెందిన కళాశాలలు తిరుపతి జిల్లాలో అనుమతి పొందినవి కేవలం 4 మాత్రమే. కానీ బ్రాంచీల పేరుతో నడుపుతున్న కళాశాలలు సుమారు 11 వరకు ఉన్నాయని విద్యార్థి సంఘాలు అధికారులకు విన్నవించాయి. కానీ ఇంటర్ విద్యాశాఖాధికారులు మంత్రి కళాశాలలపై కన్నెత్తి చూడకపోవడం దారుణం. కళాశాల బ్రాండ్ పేరుతో ఒక చోట అనుమతి పొంది అదే అనుమతులతో సుమారు 3 నుంచి 4 బ్రాంచ్‌లను నడుపుతూ వ్యాపారం చేసుకుంటున్నా అధికారులు అటు వైపు చూసిన దాఖలాలు లేవు

ఇరుకైన అపార్ట్‌మెంట్‌లలో తరగతులు

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక కళాశాలకు సైతం పూర్తి స్థాయి మౌలిక వసతులు లేకపోవడం దారుణం. ఇంటర్ విద్యామండలి నింబధనల ప్రకారం విశాలంగా, గాలి వెలుతురు ధారాళంగా వచ్చేలా తరగతి గదులు ఉండాలి. కానీ జనవాసాల మధ్య ఇరుకైన అపార్ట్‌మెంట్‌లనే తరగతి గదులుగా చూపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో పలు అపార్ట్‌మెంట్‌లలో నిర్వహించే కళాశాలలు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి జూనియర్ కళాశాల అనుమతులు పొందాలంటే 8 వేల చదరపు అడుగులు స్లాబ్ ఏరియా కచ్చితంగా ఉండాలి. అలాంటి నిర్మాణానికి అనుమతులు ఉండాలంటే స్థానిక పాలన నియమాల ప్రకారం సెట్ బ్యాక్ కింద కాంపౌండ్ వాల్, ఫ్రంట్ స్పేస్, వెంటిలేషన్ కింద స్థలం వదలాల్సి ఉంటుంది. విద్యార్థులకు, అధ్యాపకులకు పార్కింగ్ స్థలం చూపాలి. వీటన్నింటికి మించి ఫైర్ ఇంజిన్ ఏర్పాట్లు, ప్రమాదాన్ని నివారించే వెసులుబాటు ముఖ్యంగా ఉండాలి. ఇలాంటి నిబంధనలు కేవలం తూతూమంత్రంగా చూపిస్తూ మామూళ్లు ముట్టజెప్పి అనుమతులు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 5 శాతం కళాశాలలు సైతం గ్రౌండ్ (క్రీడా మైదానం) లేని దుస్థితి నెలకొంది. అయినప్పటికీ కళాశాలలు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు పురపాలక పరిధిలో రెండెకరాలు, కార్పొరేషన్ పరిధిలో ఒక ఎకరా కనీస ప్లే గ్రౌండ్ చూపించాలి. ఆ స్థాయి స్థలం విలువ లక్ష లు, కోట్లల్లో ఉండేటప్పటికీ స్థలం ఉన్న భూ యజమానిని తమ సొసైటీలో సభ్యుడిగా చూపించి, సదరు వ్యక్తి స్థలాన్ని ప్లే గ్రౌండ్‌గా చూపిస్తుండటం ప్రైవేట్ కళాశాలల తెలివి తేటలకు నిదర్శనం.ఇవ న్నీ అధికారులకు తెలిసినా అనుమతులు ఇచ్చేస్తున్నారు.

జిల్లాలోని జూనియర్ కళాశాలల వివరాలు

ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు	109
ఫస్ట్, సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు	5,475
అనుమతులు ఉన్న కళాశాలలు	77
అనుమతి లేకుండా బ్రాంచీల పేరుతో నడుస్తున్న కళాశాలలు	32
అనుమతుల లేని కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు	21 వేలు
నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కలిగిన కళాశాలలు	35
ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు లేని కళాశాలలు	97

చర్యలు చేపట్టకపోతే కాలేజీలు మూయిస్తాం



జిల్లాలో అనుమతి లేకుండా జూనియర్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పలుమార్లు ఇంటర్ విద్యామండలికి విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. సాక్షాత్తు మంత్రికి చెందిన కార్పొరేట్ కళాశాలలో మౌలిక వసతులు మాటే ఉండదు. కానీ అనుమతి ఒకే కళాశాలకు తీసుకుని తిరుపతి నగరంలో పలు చోట్ల బ్రాంచీలను నిర్వహిస్తూ వ్యాపారం చేసుకుంటూ వేల కోట్లు దండుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. లేని పక్షంలో ఉద్యమం చేపట్టి అనుమతులు లేని కళాశాలలను మూత వేయిస్తాం

- డాక్టర్ ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

డబ్బుకు అధికారులు దాసోహం



ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలను తనిఖీ చేయడం మానేశారు. అవినీతికి తలొగ్గి అన్ని సక్రమంగా ఉన్నాయంటూ అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఒక కాలేజీకి అనుమతి పొంది పలు బ్రాంచ్‌లను నిర్వహిస్తూ కోట్లు సంపాదించుకుంటున్నారు. తల్లిదండ్రులను తమ కళాశాల బ్రాండ్ పేరు చెప్పి మభ్యపెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మంత్రి లోకేష్ ఈ విషయంపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలి.

- అక్బర్, ఎస్ఎఫ్ఐ, జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

ఇంటర్ విద్యతో కోట్ల వ్యాపారం



తిరుపతి జిల్లాలో ఇంటర్ విద్యను కార్పొరేట్ సంస్థలు తమ చెప్పు చేతులోకి తీసుకున్నాయి. సామాన్యుడికి నాణ్యమైన ఇంటర్ విద్య అందడం లేదు. నిబంధలకు విరుద్ధంగా కళాశాలలను నడుపుతూ అనుమతుల సైతం లేకుండా కోచింగ్ సెంటర్లే ఇంటర్ కళాశాలలుగా తల్లిదండ్రులను మభ్యపెట్టి ఏడాది ఒక్కో కళాశాల వేల కోట్లు దండుకుంటున్నాయి. జిల్లా అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం దారుణం.

- ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, తిరుపతి

బ్రాంచీల పేరుతో నిలువు దోపిడీ



కార్పొరేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు ఒక చోట అనుమతి పొంది బ్రాంచీల పేరుతో సుమారు 3 నుంచి 4 కళాశాలలను నడుపుతున్నాయి. అక్కడ కనీసం మౌలిక వసతులు లేకుండా విద్యార్థులను పశువుల పాక కంటే దారుణంగా చూస్తున్నారు. తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి జేఈఈ, ఐఐటీ, నీట్ అంటూ ఏడాదికి కోట్లు వసూలు చేస్తున్నారు. విద్యార్థులను మానసికంగా ఒత్తిడి చేస్తూ వ్యాపారం చేస్తున్నాయి.

- శివశంకర్ నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, తిరుపతి

విద్యార్థులకు నరకం చూపిస్తున్నారు



ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు తిరుపతిలో వీధికి ఒకటి వెలిశాయి. ల్యాబ్‌లు, క్రీడా స్థలాలు అంటే ఆ ప్రైవేటు సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు కనీస పరిజ్ఞానం లేదంటే ఆశ్చర్యం వేస్తోంది. కేవలం బట్టీ చదువులు తప్ప ఆధునిక సాంకేతిక యుగంలో పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే చదువులు కార్పొరేట్ సంస్థలలో కొరవడింది. అధికారులకు అన్ని విషయాలు తెలిసినా నోరెత్తకపోవడం గమనార్హం.

- ఆర్ ఆషా, పీడీఎస్‌యు, జిల్లా కార్యదర్శి, తిరుపతి

పోలేరమ్మ తల్లికి బంగారు ఆభరణం బహూకరణ



అమ్మవారికి బంగార ఆభరణం ఇచ్చేందుకు వస్తున్న సర్వజ్ఞ కుమార కృష్ణయాచేంద్ర

వెంకటగిరి (సైదాపురం) : శక్తిస్వరూపిణి వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మ తల్లికి వెంకటగిరి రాజా వారసులు, ఏపీ క్రికెట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత వీవీకే సర్వజ్ఞకుమార కృష్ణయాచేంద్ర బంగారు ఆభరణాన్ని పోలేరమ్మ తల్లికి బహూకరించారు. జన జాతరను పురస్కరించుకుని స్వయంగా అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ఇంటి ఇలవేల్పుతో పాటు మీ ఇంటి ఆడపడుచుకు ఎంత ఇచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. తరతరాలుగా వెంకటగిరి ప్రజలను నిత్యం పోలేరమ్మ కాపాడుతోందన్నారు.

ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఎంవీ రమణ



చంద్రగిరి : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఎంవీ రమణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన పదోన్నతిపై వర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. వ్యవసాయ వర్సిటీలో వివిధ హోదాలలో 34 ఏళ్లుగా బోధన, పరిశోధన రంగాలలో సుదీర్ఘ సేవలు అందించారు. 2013లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ శాస్త్రవేత్త అవార్డుతో పాటు 2015లో యూనివర్సిటీ స్థాయిలో ఏవీ కృష్ణయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. రిజిస్ట్రార్ పదవికి మరింత వన్నె తెచ్చేలా కృషి చేస్తానని తెలిపారు.

ఎస్పీడబ్ల్యూలో గుజరాత్ అధ్యాపకులు



ఎస్పీడబ్ల్యూ కళాశాలలో గుజరాత్ రాష్ట్ర అధ్యాపకులు

తిరుపతి సిటీ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను గుజరాత్ రాష్ట్రంలోని వడాలి ప్రభుత్వ కామర్స్ కళాశాల అధ్యాపకుల బృందం శుక్రవారం సందర్శించింది. పద్మావతి కళాశాల అటానమస్ సాధించిన తీరు, మౌలిక వసతుల కల్పనపై వారు కళాశాల అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ గుజరాత్ అధ్యాపక బృందానికి కళాశాలలో నడుస్తున్న కోర్సులు, మౌలిక వసతులపై సమాచారాన్ని అందించారు. అధ్యాపకులు డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ ఉమాదేవి, గుజరాత్ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్ డాక్టర్ కేసరిసింగ్ ఎస్ పర్మార్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా పెట్టుబడిదారుల సదస్సు

- ప్రత్యేక ఆహ్వానితులకే అధిక సమయం
- మమ అనిపించిన మంత్రి ప్రసంగం
- సన్మానాల కార్యక్రమంగా మారిన వైనం



ఇన్వెస్టర్లలో ఒక్కరిగా మూలన ఆసీనులైన సీఆర్ రాజన్



సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి దుర్గేష్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతి తాజ్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు (రీజనల్ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్) మొక్కుబడిగా సాగింది. ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి హాజరయ్యారు. కాగా వేదికపై ప్రత్యేకంగా ఆహ్వానించిన ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల ప్రసంగాలకే అధిక సమయం కేటాయించారు. మధ్యాహ్న భోజన సమయంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తన ప్రసంగంలో పర్యాటక రంగ అభివృద్ధి, అవకాశాలు, ప్రభుత్వం అందించనున్న ప్రోత్సాహాన్ని వివరించే ప్రయత్నం కాస్త పక్కదారి పట్టింది. ఇన్వెస్టర్స్‌తో, హోమ్ స్టే ఆపరేటర్స్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతామంటూ కార్యక్రమాన్ని మమ అనిపించారు. అనంతరం కూటమి నాయకులు మంత్రిని సన్మానించేందుకు అత్యుత్సాహం చూపారు. అనంతరం మీడియా ముందుకు మంత్రి కందుల దుర్గేష్ వచ్చారు. ఏపీలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం, ప్రైవేట్ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కూటమి పాలనలో పర్యాటక రంగానికి ఏమి చేస్తామనే అంశాలను దాటవేస్తూ గత పాలనపై విమర్శలు గుప్పించారు.

ఆహ్వానం లేదంటూ సీఆర్ రాజన్ మండిపాటు

టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వివిధ కార్పొరేషన్లకు సంబంధించి చైర్మన్లు హాజరయ్యారు. అయితే రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్‌ను పిలువలేదు. దీంతో ఆయన మనస్తాపానికి గురయ్యారు. ప్రొటోకాల్ మేరకు పిలవాలనే జ్ఞానం లేదా అంటూ జిల్లా పర్యాటకశాఖ అధికారిని ప్రశ్నించారు. ఈ విషయాన్ని సీఎంతో పాటు ప్రివిలైజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానంటూ మండిపడ్డారు.



క్లుప్తంగా

రూ.1500 ధర తగ్గిన 1010 వరి ధాన్యం



ధాన్యాన్ని లారీకి లోడ్ చేస్తున్న కూలీలు

చిట్టమూరు : వర్షం కారణంగా మిల్లర్లు సిండికేట్ కావడంతో ఎండగారులో వరి ధాన్యం రెండు రోజుల్లో పుట్టి (1260 కేజీలు) రూ.1500 ధర తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వరకు పుట్టి రూ15,500 ఉండగా శుక్రవారం రూ.14 వేలకు రైతుల వద్ద నుంచి ధాన్యం కొంటున్నారని వాపోయారు. ధాన్యం నిల్వ ఉంచుకోలేక దళారులు చెప్పిన రేటుకు అమ్ముకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

గంగ కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి



మృతి చెందిన మస్తాన్

దక్కిలి : కండలేరు–పూండి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి చెందిన సంఘటన డక్కి లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. గూడూరు రూరల్ మండలం చెన్నూరు గ్రామానికి చెందిన తిరుపతి మస్తాన్ (40), సమీప బంధువు బాలాజీ ఇద్దరు కలిసి గురువారం వెంకటగిరిలో జరిగిన పోలేరమ్మ జాతరకు వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి దక్కిలి మండలం డీ వడ్డిపల్లి గ్రామంలో బంధువులు వద్దకు వెళ్లేందుకు వచ్చారు. డక్కిలిలోని మద్యం తీసుకుని తెలుగు గంగ కాలువ వద్దకు చేరుకుని ఇద్దరు మద్యం తాగారు. అయితే గంగ కాలువలో సరదాగా ఈత కోసం కాలువలోకి దిగారు. మస్తాన్‌కు ఈత రాకపోవడంతో గట్టు మీద కూర్చోగా బాలాజీ కాలువలోకి ఈత కొట్టేందుకు దూకాడు. వెంటనే మస్తాన్ కూడా కాలువలోకి ఒక్కసారిగా దూకేయడంతో గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న బాలాజీ డక్కిలి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు, స్థానికులు గల్లంతైన మస్తాన్ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం ఆల్తూరుపాడు గ్రామం వైపు వెళ్లే దగ్గర గంగ కాలువలో మృతదేహం లభ్యం అయింది. ఈ మేరకు డక్కిలి ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

హెరిటేజ్ పేరుతో ఇసుక దోపిడీ ?



స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా తరలించి భారీగా ఇసుకను డంపు చేస్తున్న టీడీపీ నేత

- వారం రోజులుగా టిప్పర్లతో తరలింపు
- టిప్పర్ రూ.25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న టీడీపీ నేత
- 300కు పైగా టిప్పర్ లోడ్లు అక్రమంగా డంపింగ్
- ఇవేవీ పట్టనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామని, అనధికారికంగా ఇసుక తరలింపును అరికట్టామంటూ ఉదరకొట్టే సీఎం చంద్రబాబు..హెరిటేజ్ ఫ్యాక్టరీకి అక్రమంగా ఇసుకను తరలించడం చంద్రగిరి మండలంలో చర్చనీయాంశంగా మారింది. వారం రోజులుగా నిరంతరాయంగా భారీ యంత్రాలతో స్వర్ణముఖినదిని తోడేస్తూ వందల ట్రిప్పుల ఇసుకను తరలించేస్తున్నారు. స్థానికంగా ఉండే ఓ టీడీపీ నేత అక్రమ రవాణా చేస్తుండడపై రైతులు మండిపడుతున్నారు.

స్థానిక రైతుల వివరాల మేరకు ఇలా...

చంద్రగిరి మండల పరిధిలోని కాశిపెంట్ల పంచాయతీ మొరవపల్లి స్వర్ణముఖినది పరివాహక ప్రాంతం ఉంది. వారం రోజులుగా సీఎం చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ ఫ్యాక్టరీ పేరుతో పలు సివిల్ పనులు జరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. సివిల్ పనులకు అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు స్థానికంగా ఉండే ఓ టీడీపీ నేత ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా రైతులు చెబుతున్నారు. తొలుత బోడంబాయి సమీపంలోని స్వర్ణముఖినది నుంచి భారీగా ఇసుకను తరలించేశారు. అనంతరం అక్కడ నుంచి వారం రోజులుగా మొరవపల్లి వద్ద ఉన్న స్వర్ణముఖి నదిలోని ఇసుకను హిటాచీ సాయంతో ఇసుకను తోడేసి, తన పొలంలో అక్రమంగా డంపింగ్ చేస్తున్నట్లుగా చెబుతున్నారు. రెండు రోజుల క్రితం స్థానిక రైతులకు చెందిన పంట పొలాలకు ఆనుకుని ఇసుకను తోడేయడంతో అభ్యంతరం వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. తమ పంట పొలాలు దెబ్బతింటాయని, ఇసుక అక్రమ రవాణాను ఆపాలని లేకుంటే తమ పొలాలు వరదల సమయంలో కొట్టుకుపోయే పరిస్థితి ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దర్జాగా డంపు చేసి..

సీఎం చంద్రబాబు సొంత మండలంలో భారీగా ఇసుక దోపిడీ జరుగుతుండడంపై రైతులు మండిపడుతున్నారు. పొలంలో ఇసుకను డంపు చేసి అక్కడ నుంచి టిప్పర్ల ద్వారా హెరిటేజ్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని, ఇందు కోసం ఒక్కో టిప్పర్ ఇసుకను రూ.25 వేలకు విక్రయిస్తున్నట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపామంటూనే, ఇలా హెరిటేజ్ ఫ్యాక్టరీ పేరుతో తెల్లబంగారాన్ని దోచేయడం ఏమిటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వందల టిప్పర్ల ఇసుకను తరలించేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.కోటి రూపాయల విలువైన ఇసుకను డంపు చేశారని, హెరిటేజ్ ఫ్యాక్టరీ పేరుతో ఇతర ప్రాంతాలకు సైతం ఇసుకను రవాణా చేస్తూ రూ.కోట్లు వెనుకేసుకుంటున్నట్లుగా ఆరోపిస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

హెరిటేజ్ ఫ్యాక్టరీ పేరుతో అక్రమంగా కోట్ల రూపాయల విలువైన తెల్ల బంగారాన్ని దోచుకెళ్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చోద్యం చూడటంపై ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలతో వరదలు వస్తే తమ పొలాలకు ముంపు తప్పదని ఆందోళన చెందుతున్నారు.

– ఇసుక దోపిడీపై తహసీల్దార్ శివరామ సుబ్బయ్యను వివరణ కోరగా..టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా తమ దృష్టికి రాలేదని, వెంటనే సిబ్బందిని పంపించి అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలేరమ్మ తల్లి హుండీ ఆదాయం రూ. 22,21,350



పోలేరమ్మతల్లి అమ్మవారు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ రాబడి రూ. 22,21,350 రాబడి వచ్చినట్లు ఈఓ వెంకట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గత నెల 19వ తేదీ నుంచి ఈనెల 12వ తేదీ వరకు సంబంధించి 25 రోజులకు సంబంధించి అమ్మవారి హుండీ శుక్రవారం నిర్వహించామన్నారు. ఇందులో రూ.22,21,350 నగదు, యూఎస్ డాలర్లు 5, బంగారం 1,852 గ్రాములు, వెండి 37 గ్రాములు భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, జాతర సేవా కమిటీ సభ్యులు , బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

డీఎఫ్ఓల బదిలీ

తిరుపతి మంగళం: తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్వో జీ.శ్రీనివాసులు సత్యసాయి జిల్లా డీఎఫ్ఓగా బదిలీ అయ్యారు. అలాగే తిరుపతిలో ఖాళీగా ఉన్న డీఎఫ్ఓ స్థానంలోకి జిన్.పవన్‌కుమార్ రావును నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

పట్టాభూమినే కొట్టేశారు!

- రైతుకు తెలియకుండానే టీడీపీ నేతకు కట్టబెట్టిన అధికారులు
- కేవీబీపురంలో రెవెన్యూ అధికారుల బాగోతం
- గగ్గోలు పెడుతున్న బాధిత రైతు



ఆందోళన చెందుతున్న, బాధిత రైతు

కేవీబీపురం : కేవీబీపురం రెవెన్యూ అధికారుల అవినీతి బాగోతం మరోసారి బట్టబయలైంది. వేరొకరి నుంచి కొనుగోలు చేసి, సుమారు 35 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పట్టా భూమిని రెవెన్యూ అధికారులు ఆ రైతుకు తెలియకుండా, అతడి ప్రమేయం లేకుండా అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేతకు ఆన్‌లైన్‌లో హక్కు కల్పించారు. అది కూడా కేవలం 42 రోజుల వ్యవధిలోనే ఇవ్వడం గమనార్హం. ఇది మొత్తం వీఆర్‌ఓ , తహసీల్దార్ చేశారని బాధిత రైతు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన రమణయ్య నాయుడు అదే గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్ 15లో సుమారు 1.2 ఎకరాల వ్యవసాయ భూమిలో కొంత కొనుగోలు, కొంత వారసత్వం ద్వారా పొందాడు. ఇదే భూమిలో సుమారు 35 ఏళ్లుగా సాగులో ఉన్నాడు. అయితే ఈ భూమిపై కన్నేసిన స్థానిక ఓ టీడీపీ నేత ఆ భూమిని కాజేసేందుకు పావులు కదిపాడు. స్థానిక వీఆర్‌ఓ అందుకు సహకరించడంతో పాసు పుస్తకం కలిగి ఉన్న లబ్ధిదారుడికి తెలియకుండానే వీఆర్‌ఓ ఆయా సర్వే నంబర్లకు తహసీల్దార్ కార్యాలయం నుంచే మ్యుటేషన్ కట్టించి, మండల ఆర్ఐల ప్రమేయం లేకుండానే తహసీల్దార్‌కు ఫైల్ అందించారు. దీంతో కేవలం రోజుల వ్యవధిలోనే రమణయ్యనాయుడు భూమిని శ్రీనివాసుల నాయుడు పేరుపైకి మార్చేశారు. ఇదే భూమిపై రమణయ్య క్రాప్ లోన్ కలిగి ఉండడంతో బ్యాంకుకు వెళ్లడంతో ఈ బాగోతం బయటపడింది. దీనిపై మండల అధికారులను కలిసి తనకు జరిగిన అన్యాయంపై వివరించారు. అయినప్పటికీ అధికారులు కాలయాపన చేస్తుండడంతో బాధిత రైతు మీడియాను ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

శ్రీవారి సేవకుల సేవలు అమోఘం



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

తిరుమల : తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవలు అమోఘమని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొనియాడారు. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో శుక్రవారం ఆమె అన్న ప్రసాదం స్వీకరించారు. ముందుగా అన్న ప్రసాద కేంద్రం వద్దకు చేరుకున్న ఆమెకు టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర యల్లా, భానుప్రకాష్ రెడ్డి, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆమె భోజనశాల వద్దకు చేరుకుని శ్రీవారి సేవకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు. అన్న ప్రసాదం స్వీకరించిన అనంతరం ఆమె టీటీడీ ఫీడ్ బ్యాక్ పుస్తకంలో తన అభిప్రాయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఇతర భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించడం హృదయానికి హత్తుకుందని పేర్కొన్నారు. అనంతరం ఆమె భక్తులతో ముచ్చటించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, భాస్కర్, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సదస్సు విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : తిరుపతి వేదికగా రాష్ట్రంలోనే మొట్టమొదటిగా జిల్లాలో మహిళా సాధికారిత జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాం..జిల్లా యంత్రాంగం సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాల్సి ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్వో నరసింహులుతో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సదస్సు డ్యూటీలకు వచ్చే ఉద్యోగులు సంప్రదాయబద్ధమైన దుస్తులను ధరించి రావాలని స్పష్టం చేశారు. ఆది, సోమవారాలు(14,15 తేదీల్లో) రెండు రోజుల పాటు సదస్సు ఉంటుందని వెల్లడించారు. తిరుచానూరు రాహుల్ కన్వెన్షన్ హాల్ నుంచి సీటింగ్, స్టేజ్ తదితర ఏర్పాట్లు ఓ క్రమ పద్ధతిలో ఉండేలా లోకసభ సెక్రటరీ బృందం తనిఖీ చేస్తుందని చెప్పారు. అలాగే చంద్రగిరికోట వద్ద అతిథులకు ఆతిథ్యం ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్, లోకసభ స్పీకర్, అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, రాష్ట్ర మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, పలువురు ప్రముఖులు రానున్నారని స్పష్టం చేశారు. మరోవైపు పోలీసు శాఖ నుంచి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చూసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీతో కలిసి కలెక్టర్ సమీక్ష

కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి కలెక్టర్ పోలీసులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్ట్ నుంచి వీఐపీలు బస చేస్తున్న హోటల్స్ వరకే కాకుండా సమావేశం కానున్న తిరుచానూరు రాహుల్ కన్వెన్షన్ సెంటర్ వద్ద, అలాగే చంద్రగిరి కోట వద్ద చేపట్టాల్సిన భద్రాతా అంశాలపై చర్చించారు.

ఎర్ర చందనం కేసులో ఇద్దరికి జైలు



నిందితులతో ఫారెస్టు సిబ్బంది

తిరుపతి లీగల్ : అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి, ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలించడానికి ప్రయత్నించిన కేసులో ఇద్దరికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజిన్ ఆఫీసర్ రాజేష్ , కడప ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. 2019 ఆగస్టు 29వ తేదీ పోరుమామిళ్ల రేంజ్ , మల్లేపల్లి సెక్షన్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, సిబ్బంది నిచ్చనిండ్ల అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లా బి.మఠం మండలం లింగాల దీన్నెపల్లికి చెందిన కప్పల రమేష్ , మల్లేపల్లికు చెందిన కోనేటి గురు ప్రసాద్ అలియాస్ దుబ్బోడు తదితరులు అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్ర చందనం చెట్లను నరికి దుంగలుగా మార్చి తరలించడానికి ప్రయత్నిస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొంతమంది అక్కడినుంచి పరారయ్యారు. ఆ ఇద్దరిని ఫారెస్ట్ సిబ్బంది విచారించగా ముదిరెడ్డిపల్లి బీట్ అటవీ ప్రాంతంలో ఎర్ర చందనం దుంగలను దాచిపెట్టినట్టు అంగీకరించారన్నారు. ఫారెస్ట్ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా 997 కిలోల 18 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను ఫారెస్ట్ సిబ్బంది అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

చంద్రగిరి : మహిళల ఆర్థికాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాగల్ అన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు, డెయిరీ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థ సేవలు అద్భుతమని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖామంత్రి ఎస్పీ సింగ్ బాగల్ అన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని మల్లయ్యపల్లిలోని ఓ ప్రైవేటు సంస్థ నిర్వహిస్తున్న పాలశీతలీకరణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో డెయిరీ రంగం అభివృద్ధిలో ప్రైవేటు సంస్థ భాగస్వామ్యానికి ఆయన ప్రశంసలు అందించారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం మహిళలందరూ పాల ఉత్పత్తితో పాటు, కోళ్ల పెంపకం, చేపల సాగు, పందుల పెంపకం వంటి రంగాలలో పాలుపంచుకోవాలని మంత్రి సూచించారు. ఇలా వైవిధ్యం చేర్చటం ద్వారా ఆదాయంలో స్థిరత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళా పాడి రైతుల సంక్షేమానికి, డెయిరీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. దేశంలోని పాడి రైతులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీ రుణాలను అందిస్తోందని తెలిపారు. అనంతరం ఆ సంస్థ మహిళా పాల ఉత్పత్తిదారుల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఎన్డీడీబీ అందిస్తున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. ‘లాక్‌పతి దీదీలు’, పాల ఉత్పత్తిలో ప్రతిభ చూపిన ఉత్తమ మహిళా పాడి రైతులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ తిమ్మప్ప, రాజేంద్ర బాబు, నిశాంత్, రమేష్, మోహన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్ ఆలోచనతో శ్రీకారం



మాట్లాడుతున్న రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్య దేవర ప్రసన్న కుమార్

చంద్రగిరి : లోక్‌సభ స్పీకర్ ఆలోచనతో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఏపీ శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్య దేవర ప్రసన్న కుమార్ తెలిపారు. తిరుపతిలో ఈనెల 14,15 న మహిళా సాధికారతపై పార్లమెంటు, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు నిర్వహణపై చంద్రగిరి సమీపంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఆయన పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా రాష్ట్రాల్లోని సమస్యలపై చర్చించకుండా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఒకే వేదికపై చర్చించుకునేలా లోక్‌సభ స్పీకర్ ఈ ఏడాది నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. లోక్‌సభ మార్గదర్శకత్వంలో రెండు రోజుల పాటు సభలు నిర్వహించడం జరుగుతుందని, లోక్ సభ స్పీకర్ స్వయంగా ప్రారంభ సమావేశానికి, ముగింపు సమావేశానికి అధ్యక్షత వహిస్తారన్నారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు.

మొదటి రోజు హాజరుకానున్న లోక్‌సభ స్పీకర్

మొదటి రోజు 14వ తేదీన ఉదయం 10:30 గంటలకు రాహుల్ కన్వెన్షన్ హాల్‌లో సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ముఖ్యమంత్రి చంద్రబాబు , రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరి వంశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, రాష్ట్ర మంత్రులు, లోక సభ కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరి, రాష్ట్ర కమిటీ ఛైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి వేదిక పైనుంచి ప్రారంభ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. లోక్ సభ స్పీకర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. 15న ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

మస్టర్ల మాయాజాలంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



డక్కిలి సచివాలయంలో విచారణ జరుపుతున్న ఏపీడీ వరప్రసాద్

డక్కిలి : స్థానిక పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పథకం పనుల్లో గోల్‌మాల్ వ్యవహారంపై శుక్రవారం స్థానిక సచివాలయంలో క్లస్టర్ ఏపీడీ వరప్రసాద్ విచారణ చేపట్టారు. ఈనెల 9వ తేదీన ‘సాక్షి’ దిన పత్రికలో ‘మస్టర్లలో మాయాజాలం’ అనే శీర్షికతో ప్రచురితమైంది. దీంతో డ్వామా పీడీ ఆదేశాలు మేరకు శుక్రవారం ఏపీడీ ఉపాధిహామీ పథకం సిబ్బందితో విచారణ చేపట్టారు. అంతే గాక స్థానికంగా అందుబాటులో ఉన్న మస్టర్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ విలేకర్లతో మాట్లాడుతూ.. డక్కిలిలో ఈనెల 4వ తేదీన 8 మంది కూలీలకు తప్పుడు మస్టర్లుగా వేసినట్లు గుర్తించామన్నారు. ఆ కూలీలు పనులకు హాజరు కాకపోయినా వారి ఫొటోలను మార్ఫింగ్ చేసినట్లు వెల్లడైందన్నారు. ఈ విచారణ నివేదికను కలెక్టర్, డ్వామా పీడీకి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ, ఏపీఓ కుమారస్వామి, టీఏ గిరి ఉన్నారు. డక్కిలి ఉపాధి మేట్ అవినీతి అక్రమాల వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని డక్కిలి గ్రామ వైఎస్సార్‌సీపీ నేత మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డక్కిలి గ్రామానికి ఉపాధి హామీ మేట్ రూ. 2లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. అయితే శుక్రవారం ఏపీడీ విచారణ జరిపి 8 మంది మాత్రమే కూలీ పనులకు రాని వారని మస్టర్లులో ఎక్కించినట్లు తెలిపారన్నారు. వాస్తవానికి 20 మందికి పైగా కూలీలు ఎన్నో రోజులు నుంచి మస్టర్లు ఎక్కించుకుని ఉపాధి నిధులను బొక్కేశారని తెలిపారు.

● చదువు కోసం ఆరాటం.. నిత్యం పోరాటం



నాగలాపురం మండల పరిధి నుంచి విద్యార్థులు బడికి వచ్చి, పోయేందుకు నరకయాతన పడుతున్నారు. టి.పి. కోట కన్నావరం నుంచి అటు సత్యవేడు-ఆంబాక్కం దాకా వందల మంది పిల్లలు నాగలాపురం ఉన్నత పాఠశాల, ఐటీఐ, జూనియర్, డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్నారు. విద్యార్థులు రోజు బస్సులో వెళ్ల చదువులు సాగిస్తున్నారు. అయితే మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.

- నాగలాపురం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
కొబ్బరి చిప్పల అమ్మకం కొరకు ఈ-వేలం ప్రకటన

P8/14024(43)/40/2024/Sri TT/TML (No.2630496) Date: 11.09.2025
E-Auction No.25291

... రూ.10,00,000 ... http://www.konugolu.ap.gov.in ... 0877-2263908.

Roc No:TTD-40021/10/2025-PRO SEC (Adv.No.219) Date: 12.09.2025 కార్యనిర్వహణాధికారి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ 10th / Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, M.A, M.Com, MSC, MCA, MBA,MLIS Dip,B.Tech,M.Tech,M.Phil, Ph.D., BNYS, BPT ✆ 90320 30124

Real Estate

PLOT FOR SALE
■ నేషనల్ హైవేలకు అనుకొని తిరుపతిలో తుడా ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని వసతులతో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ డైరెక్ట్ ఓనర్ సెల్: 9502774175, 7995992114

TO-LET
■ తిరుపతి, జీవకోన రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం దగ్గర పడమర ప్రక్కన విజయపురంలోని డి.నెం. 9-82 డూప్లెక్స్ బిల్డింగ్ బాడుగకు ఇవ్వబడును. సెల్: 94402 32383
■ తిరుపతి, మంగళం రోడ్‌లో RTO ఆఫీసు దగ్గరలో, విష్ణు హోమ్స్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం: 104, 3BHK ఫ్లాట్ అద్దెకు కలదు. కార్ పార్కింగ్, ఈస్ట్ ఫేసింగ్, అద్దె 13,000+, ఫోన్: 8142084239.

Wanted
■ Wanted Office boy, Solar Techician, Solar Marketing Executive, Star Enterprises Solar Vendor, Sivaram Complex, Opp. Hero Showroom, Chittoor ✆ 91829 09048

■ Seeking experienced Solar Power Consultnt/Company in Tirupati to conduct audit, diagnose production issues, and provide revamp/retrofit solutions for an existing 100 KVA Orb Energy Solar System ✆ 85559 34497
■ Wanted B.Com / M.Com / MBA Finance / CA IPCC Dropouts to be work as Field Executive in Tirupati in a reputed audit firm. Interested persons (male only). ✆ 70135 11502 for further information or mail to kowthahr@gmail.com
■ ప్రముఖ కంపెనీ నందు మార్కెటింగ్ చేయుటకు (పార్ట్/ఫుల్) M/F అభ్యర్థులు కావలెను. జీతం/మంచి కమీషన్ ఇవ్వబడును. LIC ఏజెంట్స్, రిటైర్డ్ టీచర్స్, గృహిణులకు ప్రాధాన్యత. సంప్ర: 8977624599, 8523898777
■ ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థ వారికి చిత్తూరు జిల్లాలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 8977764446,9848225678
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135
■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులకు పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640468899, 9640258899

గమనిక

వాణిజ్యపరమైన ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం
CONTACT : 9440166091, 9951602970